ఆకట్టుకుంటున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను సందర్శించిన ప్రముఖ చిత్రకారులు

విజయనగర్‌కాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తుంది. సిరి ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరి శక్తి పేరిట మహిళలు వేసిన చిత్రాలతో ఈ మెగా పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా పలువురు చిత్రకారులు మాట్లాడుతూ..మహిళల గొప్పతనాన్ని తెలియజేసేలా ప్రదర్శన నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు మురళీధర్, బాలభక్త, మెజిషియన్ సత్యాంబ, నిర్వాహకులు చొక్కాపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు

అబిడ్స్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఓల్డ్ ఫీల్‌ఖానాలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఈ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఖర్జూరాలు తినిపించారు.

రంజాన్‌లో నిరుపేదలను ఆదుకోవాలి



షకీల్ అలీఖాన్ తదితరులను సన్మానిస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: రంజాన్ మాసంలో నిరుపేదలను ఆదుకోవాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. జీఎంకే గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ షకీల్ అలీఖాన్ రంజాన్ మాసంలో చేస్తున్న సేవలను పురస్కరించుకొని మంగళవారం ఆయనను గోల్కొండ బంజారి దర్వాజ వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు దశాబ్దాలకు పైగా కేవలం రంజాన్ మాసంలోనే కాకుండా జీఎంకే గ్రూప్ వారు నిరుపేదలను ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



వేడుకల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: అవని వాత్సల్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవని ఫౌండేషన్ సభ్యులు అర్చన, రవిశర్మ మాట్లాడుతూ..మహిళగా ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు పలు స్వయం ఉపాధి పథకాలను అదిస్తున్నట్లు తెలిపారు. ఇంటి వద్దనే ఉంటూ క్యాండిల్స్, సబ్బులు, బిస్కెట్లు వంటి ప్యాకింగ్ ఉత్పత్తులు చేసి ఆర్థికంగా అభివృద్ధిని సాధించేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళామణులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముక్తేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ముత్తు గీతాంజలి, హరిణి ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు భవాని నంద, సామాజిక వేత్త డాక్టర్ సాజితిఖాన్, లక్ష్మీ ఆనంద్, సంగీత, రాంప్రకాష్ గోయల్ పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

నాంపల్లి: పదో తరగతి విద్యార్థులకు జరిగే పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆసిఫ్‌నగర్ డిప్యూటీ ఈఓ రమణరాజు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థుల మదిలో నెలకొన్న సమస్యలను నివృత్తి చేసేందుకు ఆసిఫ్‌నగర్ డిప్యూటీ ఈఓతో 'సాక్షి'ముఖాముఖిని నిర్వహించింది. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు.



ఆసిఫ్‌నగర్ డిప్యూటీ ఈఓ రమణరాజు

పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఎప్పుటి నుంచి ఎప్పుటి వరకు జరుగుతాయి?

- మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉంటాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి.

మీ జోన్ పరిధిలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎందరు? ప్రైవేట్ విద్యార్థులు ఎందరు?

- మా జోన్ పరిధిలో 12,174 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్(వార్షిక) పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 1234 మంది ప్రభుత్వ పాఠశాలలో చదివే వారు, 10,593 మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నారు. 347 మంది మైనార్టీ హాస్టల్స్‌లో చదివే విద్యార్థులు ఉన్నారు.

జోన్ మొత్తం మీద ఎన్ని పరీక్షా కేంద్రాలు ఉన్నాయి? ఈ జోన్ పరిధిలో ఏయే మండలాలు ఉన్నాయి?

- మొత్తం 58 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ఆసిఫ్‌నగర్-1, ఆసిఫ్‌నగర్-2, గోల్కొండ మండలాలు ఉన్నాయి.

పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు ఎన్ని ఉన్నాయి?

- ప్రభుత్వ పాఠశాలలు 31, ప్రైవేట్ పాఠశాలలు 189 ఉన్నాయి.

పబ్లిక్ పరీక్షల సమయం దగ్గర పడుతోంది. ఏర్పాట్లు పూర్తయ్యాయా?

- పబ్లిక్ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. 58 సెంటర్స్‌ను గుర్తించాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేని పాఠశాలల్లో సెంటర్స్‌ను ఏర్పాటు చేశాం.

పబ్లిక్ పరీక్షా సెంటర్లను ఏర్పాటులో ఏమైనా మార్పులు ఉండే అవకాశాలు ఉన్నాయా?

- ఎస్సెస్సీ బోర్డు గైడ్‌లైన్స్ ప్రకారం పరీక్షా కేంద్రాలను గుర్తించి సెంటర్‌ను మంజూరు చేస్తాం. మొత్తం జంబ్లింగ్ విధానంలో సెంటర్ల ప్రక్రియ జరుగుతుంది. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా చేపడుతాం. మౌలిక సదుపాయాల కల్పన సరిగా లేని రెండు పరీక్షా కేంద్రాలను మార్చడం జరిగిందన్నారు. రిలయన్స్, శ్రీ చైతన్య కేంద్రాల్లో మార్పు చేశాం.

కొత్తగా పరీక్ష రాయబోయే విద్యార్థులకు మీరిచ్చే సలహాలు ఏమిటి?

- వేసవిలో పరీక్షలు ఉంటాయి. పరీక్షలు పూర్తయ్యే వరకు జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌ను స్వీకరించొద్దు. రాత్రి 10 గంటలకు నిద్రపోవాలి. ఉదయం 4 గంటలకు నిద్రలేచి చదువుకోవాలి.

పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడానికి మీరిచ్చే ట్రిక్స్ ఏమైనా ఉన్నాయా?

- సైన్స్, సోషియల్ సబ్జెక్టుల్లో థియరీతో పాటుగా మ్యాపింగ్ పాయింట్స్‌ను గుర్తించడానికి, చిత్రాలను గీసి భాగాలు రాయడానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వాలి. ఇలా చేస్తే ఎక్కువ కష్టం లేకుండా సులంభంగా మార్కులను స్కోర్ చేసుకోవచ్చు.

పరీక్ష విద్యార్థులకు ట్రాఫిక్ సమస్య పెద్ద ఆటంకంగా తయారైంది? ఈ సమస్యను అధిగమించడానికి మీరెలాంటి సూచన చేస్తారు?

- మీకు ఎక్కడ సెంటర్ పడిందో ఒకరోజు ముందుగానే సరిచూసుకోవాలి. హాల్ టికెట్ నంబర్ నోటీస్ బోర్డులో ఉందో లేదా పరిశీలించాలి. అదే విధంగా పరీక్షకు హాజరయ్యే రోజు ఉదయం 8:30 వరకు పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

జీహెచ్ఎంసీ కార్మికులకు అరుదైన గౌరవం



జీహెచ్ఎంసీ కార్మికురాలి కాళ్లు కడుగుతున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సఫాయి కార్మికుల కాళ్లు కడిగి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో జీహెచ్ఎంసీ కార్మికులు రోడ్లు ఊడ్చుతూ ప్రజల సేవలు చేస్తున్నారన్నారు. కరోనా కాలంలో సైతం ప్రాణాలను తెగించి జీహెచ్ఎంసీ సిబ్బంది, కార్మికులు కరోనా వ్యాధిగ్రస్తులకు సేవలందించారని గుర్తుచేశారు. సమాజంలో వీరే ఉన్నతమైన వ్యక్తులని తాము భావిస్తున్నామన్నారు. అనంతరం వారికి మిఠాయిలు, టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్ సింగ్, శ్రీనివాస్‌యాదవ్, రఘు, రేణుకా, కాజల్, రామకృష్ణ, విజయ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు, ఏరియా కమిటీ ప్రతినిధులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయం నానల్‌నగర్, లంగర్‌హౌస్, గోల్కొండ డివిజన్లకు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. తమ తమ ప్రాంతాల సమస్యలు తెలుసుకోకుండా నిర్లక్ష్యం వహించే వారిని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. తమ బాధ్యతలను గుర్తించి వారంతా ప్రజలను కలుసుకుంటూ ఉండాలని వారి సమస్యలను తన దృష్టికి తేవాలని ఆయన అన్నారు. గత కొన్ని రోజులుగా టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్ల నుంచి ప్రజలు వారి సమస్యలు నేరుగా తన వద్దకు వస్తున్నారని అక్కడ ఏరియా కమిటీలు లేవా అని ఆయన ప్రశ్నించారు. ఏరియా కమిటీ ప్రతినిధులు తమ తమ ప్రాంతాల్లో పర్యటిస్తుంటే వారికి ప్రజలతో సత్‌సంబంధాలు ఏర్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీద్‌ఖాన్, రసూల్, రఫత్, జబ్బార్ తదితరులున్నారు.

అక్రమ కనెక్షన్లపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలి



వాటర్‌వర్క్స్ ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: అక్రమ కనెక్షన్లపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపించాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి అక్రమ కనెక్షన్లపై విచారణ చేయించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలకు అధికారులు ఇల్లీగల్‌గా తాగునీటి, డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. అక్రమ కనెక్షన్లను పరిశీలించేందుకు ఒకరోజు సమయం కేటాయించాలని ఆయన జలమండలి ఎండీని కోరారు. అక్రమంగా నిర్మించిన కాంప్లెక్స్‌లో భవనాలకు సంబంధించిన డ్రైనేజీ పైప్‌లైన్‌ను బస్తీల ప్రజలకు సంబంధించిన మురుగునీటి పైప్‌లైన్‌లో అక్రమంగా కలపడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ప్రజలు ఎంతో పవిత్రంగా నవరాత్రులు నిర్వహించుకుంటారని, అదేవిధంగా రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షల్లో ఉంటారని, రోడ్లపై గల్లీల్లో మురుగునీరు పారుతుంటే వారు మురుగునీటిలో నుంచి ఆలయాలకు, మసీదులకు వెళ్లాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించి వెంటనే విచారణ చేయాలని విజిలెన్స్ అధికారులు, డీఓపీ అధికారికి ఆదేశాలు జారీ చేశారని ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకులు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడిచేసిన ముగ్గురి అరెస్టు

విజయనగర్‌కాలనీ: పాత కక్ష్యల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కర్రలతో దాడిచేసి గాయపరిచిన ముగ్గురిని టప్పాచబుత్ర పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కటకటాల్లోకి పంపించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు, అడ్మిన్ ఎస్ఐ.మహ్మద్ అమ్జద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం..జిర్రా నర్రాజ్‌నగర్‌లో నివసించే ఆరీఫ్ అనే వ్యక్తి స్థానికంగా ఉన్న ఫర్నిచర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. కాగా ఇటీవల ఇతనిపై అదే ప్రాంతానికి చెందిన గౌస్ (37), మహ్మద్ తాహెర్ (30), అక్రమ్ (30) గొడవపడి కర్రలతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



వేడుకల్లో మురళీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు

గన్‌ఫౌండ్రీ: గాంధీభవన్ వద్ద గల పటేల్‌నగర్‌లోని గోదాం మైసమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.మురళీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

రేపు హెచ్‌సీయూలో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు హెచ్‌సీయూ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో ఈ ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజేరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్యవక్తగా డెన్మార్క్‌లోని ఆర్హస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ పాల్గొని 'ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపడం ఎలా .. అనే అంశంపై ప్రసంగిస్తారు. ఈ సమావేశం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ బయాలజీ ప్రొ.అనిత జగోటా పర్యవేక్షణలో సాగుతుంది.

విజయనగర్‌కాలనీలో మహిళా దినోత్సవం



విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ మహిళా మండలిలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు అనుగోలు రంగశ్రీ, రామలక్ష్మీ మాట్లాడుతూ..అనేక ధార్మిక, సేవా, విద్య, వైద్య కార్యక్రమాలతో విజయనగర్‌కాలనీ మహిళా మండలి చేస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సునిత, జయ, రాజిలతో పాటు మహిళామండలి సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల రాకపోకలను అనుమతించాలి



గోషామహల్ ప్రాంతాన్ని సందర్శించిన పురుషోత్తమ్‌రావు, సురేష్, ఏసీపీ ధనలక్ష్మి

అబిడ్స్: గోషామహల్ ప్రధాన రహదారిలో నాలా కూలిపోవడంతో వాహనాల దారి మళ్లించగా ట్రాఫిక్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక నాయకులు ఆలపురుషోత్తంరావు, సురేష్ ముదిరాజ్ విజ్ఞప్తి మేరకు గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ, జీహెచ్ఎంసీ ఏఈ మహేందర్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గోషామహల్ ప్రధాన రహదారి మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో వ్యాపారాలు నడవక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాపారులు వాపోతున్నారన్నారు. వెంటనే ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని వారు ఏసీపీ ధనలక్ష్మికి విజ్ఞప్తి చేయగా ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ట్రాఫిక్ ఏసీపీ ఏఈ మహేందర్‌తో మాట్లాడి నాలా పైకప్పు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని కోరినట్లు పురుషోత్తంరావు అన్నారు.

మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి



మహిళా నేతలతో కలిసి సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చార్మినార్: మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మా దుర్గాకి కృప'సనాతన చారిటబుల్ ట్రస్ట్‌తో కలిసి బీజేపీ చార్మినార్ నియోజకవర్గ నాయకులు మంగళవారం ఘాన్సీబజార్‌లోని లైబ్రరీ హాల్‌లో మహిళా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, తెలంగాణ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమామహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా మహిళల సంక్షేమానికి ప్రధానిమోదీ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. రాజకీయాలకతీతంగా కులమతాలతో సంబంధం లేకుండా మహిళాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్, దినేష్, శ్రీధర్ యాదవ్, స్వప్న అద్వా హేమ మాలిని, మాతా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ముకుంద్ లాల్, అగర్వాల్ ట్రస్ట్, అగర్వాల్ స్కీమ్ స్థాపకులు పాల్గొన్నారు.

'మహిళలు సమాజానికి దిక్సూచి లాంటి వారు'



ఉపాధ్యాయులకు మెమొంటో అందజేస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్, సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: సమాజాన్ని మార్చగలిగే శక్తి మహిళల్లో ఉందని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. మంగళవారం గోల్కొండ నయాఖిలాలోని ఉర్దూ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాళ్లకు మెమొంటోలు ఏసీపీతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మహిళలు సమాజానికి దిక్సూచి లాంటి వారన్నారు. రాజకీయ రంగంలోనే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాల్లో సైతం మహిళలు పురుషులకు ధీటుగా రాణించారన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, పాఠశాల అకాడమిక్ హెడ్ యాస్మిన్ బేగం తదితరులున్నారు.

ఆరె కటికల అభ్యున్నతికి కృషి : మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: ఆరె కటిక కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో 16వ ఆరెకటిక మహాసభ నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా, ఆరు గ్యారంటీల అమలు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కులగణన నిర్వహించి బీసీల జనాభాను అధికారికంగా ప్రకటించామని గుర్తుచేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. బీసీల జనాభా అధికారికంగా తెల్పడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు భవిష్యత్తులో కూడా బీసీలకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు నాడు బీసీలు గుర్తురాలేదని, ఇప్పుడేమో బీసీలపై కపట ప్రేమను కనబరుస్తున్నారని మండిపడ్డారు. ఆరె కటిక కులస్తుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, కార్పొరేషన్ల చైర్మన్‌లు ఇ.అనిల్, ఫయీం, శివసేనారెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లతో సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరి పంచాక్షరి

ఫిలింనగర్: మీడియేషన్ సెంటర్ల ద్వారా సత్వర పరిష్కారం, న్యాయంతో పాటు కోర్టులపై కూడా భారం తగ్గుతుందని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరి, జిల్లా సెషన్స్ జడ్జి సీహెచ్. పంచాక్షరి అన్నారు. ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మీడియేషన్ సెంటర్లపై శిక్షణ పొందిన ప్రతినిధులతో కలిసి మంగళవారం బస్తీవాసులకు ఈ సెంటర్ ఆవశ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 మీడియేషన్ చట్టం ప్రకారం ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో మంచి ఫలితాలు రావడంతో ఇప్పుడు అన్ని చోట్లా ఏర్పాటు చేసేందుకు న్యాయ వ్యవస్థ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ మీడియేషన్ సెంటర్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా చిన్న చిన్న కుటుంబ తగాదాలతో పాటు గొడవలు వంటి వాటికి సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ సెంటర్ల వల్ల కోర్టులు, పోలీస్ స్టేషన్లపై భారం తగ్గుతుందని అన్నారు. తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలను వీటి వల్ల పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, స్టేట్ లీగల్ అథారిటీ సర్వీసెస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.కళార్చన, ఫిలింనగర్ ఎస్ఐ గణేష్, మీడియేషన్ కమిటీ సభ్యులు బొజ్జ పీటర్, జిల్ల సుగుణమ్మ, ఎస్.దాసు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా సీసీ రోడ్లు వేయండి

బంజారాహిల్స్: బీఎస్‌మక్తాలో పాడైపోయిన రోడ్ల స్థానంలో నూతనంగా సీసీ రోడ్లు వేస్తున్న అధికారులు ఒకేసారి రెండు, మూడు రోడ్లు తవ్వేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలోనే పురాతన మసీదు సుబా ని మసీదుకు దారి తీసే రెండు దారులు పూర్తిగా తవ్వేయడంతో నమాజ్‌కు వెళ్లి రావడానికి ఆటంకాలు వస్తున్నాయని స్థానిక నేత సయ్యద్ మోహిసిన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్కూల్ పిల్లుల, పెద్ద వారు కూడా ఇబ్బంది పడుతున్నారని త్వరితగతిన ఇక్కడ రోడ్డును అందుబాటులోకి తేవాలని వారు కోరుతున్నారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- 25 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్లకు పెంచాలి
- ఎన్‌హెచ్ఏఐ ఎదుట ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ధర్నా



ధర్నాలో ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులు

బంజారాహిల్స్: రీజనల్ రింగ్ రోడ్డు(ట్రిపుల్ ఆర్) నార్త్ సైడ్ అలైన్‌మెంట్ మార్చాలంటూ ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్య వేదిక(ఉత్తరభాగం) ఆధ్వర్యంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్, తూప్రాన్, సంగారెడ్డిల వద్ద ఓఆర్ఆర్ నుంచి 25-28 కిలోమీటర్లు తీసుకోవడం వల్ల మున్సిపల్ ప్రాంతాలు, హెచ్ఎండీఏ లే అవుట్లు రెండు మూడు భాగాలుగా విడిపోతున్నాయని వారు అన్నారు. ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.2-5 కోట్ల విలువ గల భూములు, గజానికి రూ.20 వేలు కలిగిన ప్లాట్లు, ఇళ్లు ట్రిపుల్ ఆర్‌లో పోతున్నాయని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అలైన్‌మెంట్ 40 కిలోమీటర్లకు అనగా గ్రామీణ ప్రాంతాలకు మార్చాలన్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్లకు తీసుకోవడం వల్ల గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రభుత్వానికి పరిహార బాధితుల సంఖ్య కూడా తగ్గుతుందన్నారు. ఈ ప్రాంత రైతులు గతంలో వివిధ రకాల ప్రభుత్వ ప్రాజెక్టులు, నేషనల్ హైవేలు, విద్యుత్ లైన్లు, నీటి కాల్వల కోసం రెండు మూడుసార్లు తమ భూములను కోల్పోయారన్నారు. మళ్లీ ఇప్పుడు ట్రిపుల్ ఆర్‌లో కోల్పోతున్నారన్నారు.